## కోడలిగా
## ఆ ఇంటిలోనికి
## అడుగు పెట్టిన
## ఆమె అనుభవించిన
## పదిహేను నెలల నరకం?

## ఆశ

### గంటి
### రమాదేవి
### కథ

**"ALMOST ANYTHING CAN BE ENDURED BUT NOT STUPIDITY"**

రేకుల షెడ్‌లోకి సూర్య కిరణాలు సూటిగా పడ్తున్నాయి. రేకులకున్న చిన్నచిన్న కన్నాలలోనుంచి సున్నా సున్నాలుగా గోడానంతా విశాలమైన పొలంలో కాబూలీ శనగల్లా అక్కడక్కడా చెదిరిపోయి కనుపిస్తున్నాయి.

షెడ్ లోపల పసుపు, ఎరుపు కలిసిన రంగులో కొన్ని వందల బెల్లపు ముద్దలు, పాత కుంచెపు ఆకారాల్లో. ఓ మూల మినుముల బస్తాలు... ఇంకొక మూల పత్తి బేళ్ళు.

ఆ గోడాన్‌లో అపర్ణ కూర్చుని వుంది ఒక స్టూలుమీద. అపర్ణ కూర్చున్న ప్రదేశం గోడాన్ తలుపులకు దగ్గరగా వుంది. ఆమెను ఒక స్తంభానికి కట్టేస్తూ, జనపనార తాళ్లు.

తలుపు బయట ఏవో మాటలు...

"జాగ్రత్త! ఇదో మాయలమారి. మంత్రాల మరిడమ్మ... చీమను కూడా లోపలికి పోనీకు. వీళ్ళకేవో శక్తులుంటాయి. ఆ శక్తితో తనవాళ్ళను పిలిపించుకుంటారు."

'ఆ భయంలేదు. ఎవరైనా వస్తే ముందు ఆళ్లని వేసేసి ఆ తర్వాత దీన్నేసేస్తాం.'

ఆ ఇద్దరూ అపర్ణకు దగ్గర బంధువులు. భర్త అన్నగార్లు. అపర్ణ స్పష్టా స్పష్టంగా వున్న గోడాను వెలుగులో చూసింది ఆ దృశ్యం. ఆమె వళ్లు అసహ్యంతో కంపించిపోయింది.

బెల్లపు ముద్దలచుట్టూ వందల సంఖ్యలో బొద్దింకలు. క్రింద కారిన బెల్లపు పాకాన్ని చప్పరిస్తున్నాయి.



నిగనిగ మెరిసే రెక్కలతో చారలు కలిగిన ముక్కులు, పొడవుగా మీసాలతో. అసహ్యాకరమైన ఆ జీవుల్ని చూస్తే అపర్ణకు వళ్ళు గగుర్పొడుస్తుంది.

తదేకంగా చూస్తున్న అపర్ణ ఉలిక్కిపడింది. మండ్రగబ్బలంత తేళ్ళు నెమ్మదిగా బెల్లపు అచ్చుల సందునుంచి బయటకు వచ్చాయి.

వడువుగా తమ రంపపు పళ్ళలాటి నోటితో అందిన వాటిని పట్టి తీసుకుపోతున్నాయి– వాటి నోటిలో గిలగిల లాడుతూ బొద్దింకలు – బొద్దింకల గుంపు చెదిరిపోయింది.

రాత్రి తీసుకు వచ్చి ఆ గోదాములో కట్టేసారు.

పున్నమి వరకు వుండే తను సామాన్యమైన మనిషిట. లేకపోతే మంత్రగత్తెట–చావక పోతే చంపేస్తారు. ఆ తర్వాత?

* * *

అపర్ణ బి.కాం. రిజల్టు వచ్చినప్పుడు, ఎంతో సంతోషంగా గాలిలో తేలిపోయే ఆనందంతో వున్నప్పుడు, ఆమె అన్న శ్రీనివాస్ ఓ మాదిరిగా నవ్వాడు.

"నే పాసయితే నీకు సంతోషంగా లేదా! లేకపోతే నీకున్న డిగ్రీ నాకుందని అసూయా –" అడిగింది అపర్ణ శ్రీనివాసుని.

"ఆ ప్రశ్నకు సమాధానం చెప్పేముందు – నా ప్రశ్నకు మీరంతా సమాధానం చెప్పాలి. ఒ.కే." అన్నాడు.

అపర్ణతో పాటున్న మిగిలిన నలుగురూ తలలూపారు– ఇంటర్ చదువుతున్న సుబ్బులక్ష్మి, టెన్త్ చదువుతున్న గాయత్రి, సెవన్త్ చదువుతున్న రేఖ, మూడోక్లాసు చదువుతున్న సదాశివుడు.

"అపర్ణా నువ్వు చెప్పు– నీకు అయిదు వందలిస్తే ఏం చేస్తావ్–"

"ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్న ఏమల్ చీరా, కరోనా చెప్పులు, ఇమిటేషన్ ముత్యాలు, గాజులు– కొనుక్కుంటా–" అపర్ణ అంది.

"నీకు రెండు వందలు–" సుబ్బులక్ష్మిని అడిగాడు.

"మేకప్ బాక్స్, నెయిల్ పెయింట్, రిబ్బన్లు, ఇంకా–"

"నీకు వంద–గాయత్రి–"

"పట్టు పరికిణీ.

"నీకు ఇరవై–చిన్నదానివిగా– రేఖా..."

"ఉడిపి హోటల్లో, నాలుగు ఇడ్లీలు, రవ్వదోశ, కాఫీ, పాలకోవాలు బోలెడు."

"నువ్వురా, ఆటలో అరటిపండూ–సదాశివా..."

"మరి నాకెంత ఇస్తావ్ ? సదాశివుడు అడిగాడు.

"అయిదు–"

"క్యాడ్‌బరీస్ చాక్లెట్లు పది–"

శ్రీనివాస్ అందరికేసి నవ్వుతూ చూసి అన్నాడు–

"నా దగ్గర ఒక్క కాణీ లేదు– ఊరికే అన్నాను. మీకు తీరే కోరికలేమన్నా వున్నాయేమోనని. మీకులాగే నాకు తీరని కోరికొకటుంది.

"ఉద్యోగం–"

"నీకే కాదు, అమ్మకు, నాన్నకి వున్నాయి తీరని కోరికలు. అపర్ణక్కయ్య పెళ్ళి చెయ్యాలని" గాయత్రి అమాయకంగా అంది. అందరూ నవ్వారు.

"అవు అందుకే అలా నవ్వాను– మన జీవితంలో ఇవి తీరే కోరికలు కావు. ఇంచక్కా చిరంజీవి సినిమాకెడితే, మన కోరికలన్ని వాళ్ళద్వారా చూసి సంతోష పడమన్న

అపర్ణ శ్రీనివాస్ మాటల్లో అర్థాన్ని గ్రహించగలిగింది–

జీవితంమీద ఆసక్తి పోయిన ఆ సమయం లో 'సిరిసి' నుంచి అపర్ణకు సంబంధం వచ్చింది.

"పిల్లవాడు అయిదుగురి అన్నదమ్ముల లో ఆఖరివాడు. చేసేది వ్యవసాయం. అయితేనేం, బ్యాంకు మేనేజర్‌కి వచ్చే నెలసరి ఆదాయం ఓ రోజులో సంపాదిస్తాడు

బంగారం పండే భూములు, పాడి, పశువులు, ట్రాక్టర్లు, నౌకర్లు, లంకంత ఇల్లూ... నీ పిల్ల సుఖపడ్తుంది... సంబంధం తెచ్చినాయన ఊదరగొట్టాడు అపర్ణ తండ్రిని.

"మరి కట్నం? సందేహంగా అడిగాడు అపర్ణ తండ్రి.

"ఒక్క పైసా అక్కర్లేదు. వాళ్ళకి చదువుకున్న పిల్ల, నాజూకుగా, ఎర్రగా వున్న పిల్ల కావాలట. అపర్ణ అన్నివిధాలా సరిపోతుంది."

"మరి 'సిరిసి' అంటున్నారు... అదెక్కడో..."

"నీ చాదస్తంగాని 'సిరిసి' ఇండియాలోనే వుంది. మహారాష్ట్రలో... మన ఆడపిల్లలు మహారాష్ట్ర కోడళ్ళుగా చాలా కాలం క్రితమే వెళ్ళడం మొదలయింది."

ఆడపిల్ల పెళ్ళి అంటే పులితో బోనులో కాపురం చెయ్యడంలాంటి పీడకలలా భావించే తల్లిదండ్రులకు, కట్నం బాధ లేదని తెలియగానే అది కాగితం పులి అని తెలిసిన రిలీఫ్ కనుపిస్తుంది. పైగా పెళ్ళికొడుక్కి అంతులేని సంపద. ఇంకా ఏం కావాలి జీవితానికి.

మొదటిసారి వినోభాను చూసి ఝడుసుకుంది అపర్ణ. అదిలాబాద్ అడవుల్లో అప్పుడప్పుడు దోసపాదులు పాడుచేస్తూ కనపడే ఎలుగుబంటిలా వున్నాడు. బాడీ రఫ్... మాట రఫ్... ప్రవర్తన రఫ్... అయితేనేం బాగా డబ్బుంది.

పెళ్ళి అయిన తర్వాత...



దక్షిణ ఎక్స్‌ప్రెస్‌లో విఠోబాతో ఒంటరిగా వెడుతున్న అపర్ణకు దుఃఖం పొర్లి వచ్చింది. అన్నయ్య, అమ్మ, నాన్న, చెల్లాయిలు, తమ్ముడు, తనకిష్టమైన మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ స్టేషన్ ఇవన్నీ ఇక కనపడవు.

ఆమె కన్నీటితెర నీటి బిందువుగా మారేలోపల రైలు కదిలింది. నిర్లిప్తంగా, నిరాసక్తంగా ప్రయాణం సాగించింది అపర్ణ.

హింగల్‌ఘాట్ రైల్వే స్టేషనులో దిగి బస్ స్టేషన్‌కి వెళ్ళారు అపర్ణా, విఠోబా.

''సిరిసి'' వెళ్లే బస్సెక్కారు. కిక్కిరిసివున్న ఆ బస్‌లో అపర్ణ నిలబడే ప్రయాణం చేసింది చివరిదాకా. మధ్యాహ్నం అయింది 'సిరిసి'కి వచ్చేసరికి.

అక్కడ నుండి రెండెడ్ల బండి ప్రయాణం!

కనుచూపు మేర వరకు నరసంచారం లేదు. ప్రయాణపు మొత్తంలో పచ్చిమిర్చి, పత్తి, గోధుమ, జొన్నలు, రాగులు, సీదుర్లి, శనగ పండే పంటపొలాలు- ఇవే.

విఠోబా పాక హోటలు నుంచి టీ, రొట్టె పట్టుకు వచ్చాడు. ఎండిన ఆ రొట్టె, మురికి గ్లాసులో కాలువ నీళ్ళలాటి టీ చూసేసరికి తన భవిష్యత్ జీవితం ఎలా వుంటుందో అర్థమైపోయింది అపర్ణకి.

పెళ్ళి ప్రతి ఆడపిల్ల జీవితంలో జరిగే సంఘర్షణ. పచ్చగా పెరుగుతున్న మొక్కని, వేళ్ళతో పెకలించి వేరేచోట పాతితే బతికితే బతుకుతుంది లేకపోతే లేదు. అలాటిదే ఇది.

అయితే అపర్ణ అనుకోలేదు- అనూహ్యమైన, భయంకరమైన జీవితం తనకోసం ఎదురు చూస్తూ వుందని.

''సిరిసి''కి దగ్గరగా సరస్వతినది. పేరుకు నదేగాని, నీరే వుండదు. చిన్న పిల్లకాలువలా ప్రవహిస్తూ వుంటుంది ఏడాదిలో చాలాకాలం.

విఠోబా బండి ఆపి, సరస్వతి నదిలో దిగి ముఖం, చేతులు కడుక్కొని కడుపు నిండా నీళ్ళు తాగాడు.

'నువ్వు తాగు' అన్నాడు అపర్ణను చూసి

అపర్ణకు దాహంగా వుంది. ఆశతో నదిలోకి వెళ్ళిన అపర్ణ అసహ్యంతో వెనక్కి వచ్చింది. ఆశ్చర్యంగా చూసింది విఠోబాను.

సరస్వతి నదీకాదు... ఓ మురికి కాలువ. పశువులను కడుగుతున్నారు ఓ పక్క, బట్టలు ఉతుకుతున్నారు చాకిరేవులో.

'ఈ నీళ్ళు తాగి ఎలా బతుకుతున్నారు!' వుండబట్టలేక గట్టిగా అంది అపర్ణ.

విఠోబా, కొరడాతో కొట్టినట్టు చూసాడు.

బండి దిగగానే ఓ మాదిరి స్వాగతం లభించింది- అత్తగారింట్లో.

అపర్ణ అత్తగారు రుక్కుబాయి, విఠోబాకు తగ్గ పర్సనాలిటీ. తోడికోడళ్ళు సావిత్రి, హరిబాయి, నాంగరా, శాంత. అందరూ ఆ పరిసరాలకు సరిపోయేట్టు వున్నారు.

రోజంతా ప్రయాణంచేసి వచ్చినా అపర్ణ వాళ్ళకన్నా ఫ్రెష్‌గా, నీట్‌గా వుంది.

విఠోబా తల్లితో ఏదో అన్నాడు మరాఠీ లో.

"ఆ" అన్నారు విఠోబా వదినలు.

"మీ నాంగర్ సోంబత్ తుచాపాస్ ఓడిన్" అత్తగారి కంఠం కర్ణ కఠోరంగా వినపడింది. లేగులాబీ రేకులా వణికిపోయింది అపర్ణ. ఆ మాటలనుబట్టి గ్రహించింది- సరస్వతీనదిలో నీటి గురించి తనన్న మాటలు తల్లికి మూటగట్టాడు విఠోబా. అదే మహాపరాధంలా అత్తగారు, తోడికోడళ్ళు కృద్ధులై చూశారు. మరాఠీ మాటలకు అర్థం తర్వాత తెలిసింది- పొలంలో వేసి నాగలితో దున్నేయాలి, దీన్ని అని.

ఆ రాత్రి మొదటిసారి రుచి చూసింది 'సిరిపి' భోజనం. తోలు పట్టాల్లాటి రొట్టెలు, లై పిండిలాటి ముద్ద, ఉల్లిపాయ, పచ్చిమిరప కాయలు- పెరుగు, మజ్జిగలాటి పదాలు వాళ్లెపుడూ వినలేదు. అపర్ణ కంటిలో నీరు గిర్రున తిరిగింది.

అమ్మా- ఆకలి. నువ్వు అన్నం పెట్టేటప్పుడు నిన్ను ఏడిపించేదాన్ని. అదిలేదనీ, ఇది లేదని విసుక్కునేదాన్ని, ఇక్కడ అన్నమే లేదమ్మా".

అపర్ణ గుండె నీరయింది. ఇది ఈ ఒకరోజు కాదు, జీవితాంతం.

ఆ రాత్రి మరింత భయంకరమైన అనుభవం రుచిచూసింది విఠోబా చేతిలో.

విఠోబా ఆకారంలోనే ఎలుగుబంటి కాదు, ప్రవర్తనలోకూడా స్పందన, అనుభూతి, సుఖ స్పర్శ, మంచి మాట, తియ్యటి ఓదార్పు, ఇలాటివి వుంటాయని అతనికి తెలిసినట్టు లేదు.

తెల్లవారింది.

తోడికోడళ్ళందరూ, బట్టలు, అంట్లు తీసుకుని సరస్వతి నదికి వెళ్ళారు.

'ఈ నీళ్ళు త్రాగకండి, మీ పిల్లలకు పట్టకండి, దూడలకు కూడా.

తోడికోడళ్ళు కోపంగా చూసారు. పందికి పన్నీరు స్నానం చేయిస్తానంటే 'గుర్'మని తన నిరసన వ్యక్తం చేసినట్టు.

## అబద్దాలు!



వియ్యంకుణ్ణి కోపంగా అడిగాడు పెళ్ళికొడుకు తండ్రి.

"పాతిక వేలు కట్నం, బీరువా, డబుల్‌కాట్, పిల్లాడికి స్కూటర్ ఇస్తామని చెప్పి... పెళ్ళి అయిన తరువాత ఇవ్వనంటారేంటి?!"

"నూరు అబద్దాలు ఆడైనా ఓ పెళ్ళి చెయ్యాలని పెద్దలనటంవల్ల అన్నీ అబద్దాలే చెప్పాను".

"ఆ...!!!"

-సాయి గంగాధర్ చామర్తి, (విజయవాడ).

ఆ తర్వాత ఆరు నెలల్లో-

సావిత్రి అయిదేళ్ళ కొడుకు కలరా వచ్చి పోయాడు. గేదెలు చూడివి నాలుగు చచ్చిపోయాయి. ఉష భర్తకు ధనుర్వాతం వచ్చి చచ్చినంత పనైంది.

పండిన తాటి పండుమీద కాకి కూర్చుంటే అది క్రింద పడింది. కాకి ఎంతో సంతోషించింది- తనవల్లే తాటిపండు పండిందని.

అలాటి కనెక్షన్ ఇచ్చేసారు అపర్ణ అత్తగారు- మిగిలిన ఆడవాళ్ళు. "అది వచ్చిన తర్వాత అన్నీ అనర్థాలే".

అపర్ణ మరీ వంటరిదైపోయింది.

అమ్మ, అన్నయ్య, చెల్లెళ్ళు చుట్టపు వచ్చారు.

నేను ఇంటికి వెళ్తాను పంపించరూ, అడిగింది విఠోబాను.

"మీ తులాన్ జమాన్ దోష్తీ కరీన్'.

ఎందుకో అంత క్రౌర్యం- "నిన్ను పాతిపెడతా" అన్నాడు మరాఠీలో. అప్పుడు పుట్టింది నందన వనంలో విషవృక్షం. అపర్ణ వచ్చినప్పటినుండి ఆ ఇంటికి అరిష్టం పట్టిందట. ఆ ఏడాది పత్తిచేలో పురుగు పట్టింది.

కారణం పురుగుల మందులో కల్తీ.

వాళ్ళ దృష్టిలో ఆమే కారణం.

దేశంలో వర్షాలు లేవు. "సిరిసి"లోనూ లేవు-

అందుకు కారణం- అపర్ణ.

మానసికంగా దిగజారిపోయింది అపర్ణ. కలకలలాడుతూ కరువంజి మొక్కలా వున్న ఆమె ఆర్నెల్లలో ఎండి కంపయి పోయింది.

బెల్లం వండి అమ్ములు పోసి గోడౌనులో దాస్తే, దాని రంగు మారి, రుచి మారి, విషతుల్యమైపోయింది. కారణం బొద్దింకలు, తేళ్ళు, కీటకాలు.

అపుడు పడింది ముద్ర.

అపర్ణకు దుష్ట శక్తులు వున్నాయి.

ఇదిగో పులి అంటే, అదిగో అది పెట్టిన గుడ్డు అనే లోకంలో వంటరి ఆడపిల్ల- పరాయి ఇంటిది- ఆసరా లేనిది- వాదించగలదా వాళ్ళతో-

"సిరసి" గుప్పుమంది- పట్నం నుంచి వచ్చింది మహా మాంత్రికురాలు-

అదే సమయానికి-

ఒక రోజు చుట్టం చూపుగా వచ్చిన తండ్రితో అంది అపర్ణ.

'నాన్నా! నేనిక్కడుండలేను- మనూరావచ్చేస్తా'

ఆయన మౌనంగా కొన్ని నిముషాలుండిపోయాడు- ఆ మౌనంలో ఎన్నో భావాలు- చెప్పకుండానే వింది అపర్ణ- ఆయన వెళ్ళిపోయాడు.

ఆ ఒక్క ఆసరా పోయింది. ఇప్పుడు పూర్తిగా ఏకాకి!

ఉప్పెనలా దుఃఖం పొంగింది. వెక్కి వెక్కి ఏడ్చింది. ఒక్క మూడు ముళ్ళతో, పేగు ముడి తెగిపోయింది. దాంతో పరాయిదయింది.

ఉష భర్తకు మరలా తిరగబెట్టింది.

అపర్ణ వుండబట్టలేక చెప్పింది. పరిసరాలు, తినే తిండి, త్రాగే నీరు శుభ్రంగా వుండాలని. పట్నంలో డాక్టరుకు చూపించమని.

ఆమె మాటలు విన్న అందరూ మౌనం గా వుండిపోయారు. కళ్ళతోనే సంభాషణ– ఆ కళ్ళలో వికృతమైన మెరుపు.

నలుగురు మగాళ్ళు అపర్ణను పట్టుకున్నారు!!

''రాక్షసీ! ఇన్నాళ్ళూ ఇదే కూడు తిన్నాం, నీళ్ళు త్రాగాం. ఏమీ కాలేదు. నువ్వేదో మంత్రం వేసావ్, ఇలా అవుతోంది.''

అపర్ణ నిర్ఘాంతపోయింది.

మంచి మాటకి ఇదా పర్యవసానం? అత్తగారింట్లో కష్టాలంటే– ఆర్థికమైనవే వుండి తీరాలనుకుంది ఇన్నాళ్ళూ – కాని ఇదేమిటి? ఏదో ధైర్యం – వీళ్ళు ఏమీ చెయ్యరు – తను ఇంటి కోడలు.

ఆమె అంచనా మరోమారు తప్పింది.

బెల్లపు ముద్దలు వుంచే గోడౌనులో, తాళ్ళతో కట్టేసారు అపర్ణను–

కాలేజీలో చదివిన అపర్ణ, నాగరికత నిండిన ప్రదేశంలో పెరిగిన యువతి, నోరు పెగలక, చేతిలో శక్తి లేక, బలి పశువులా ఊప స్తంబానికి కట్టబడింది–

ఇంకా మూడు రోజులు–

నీరూ ఆహారం లేకుండా వుండగలదా!

సరిగ్గా అప్పుడు–

* * *

తలుపుల బయట మాటలు–

తనకి పరిచయమైన కంఠం–? శ్రీనివాస్.

''అన్నయ్యా– నేనిక్కడున్నాను–'' సంబరంతో అరిచింది.

ఆమె మనసులో భావానికి శబ్దంగా రూపాంతరం చెందే శక్తే వుంటే అది నింగినీ, ఆకాశాన్నీ బద్దలు కొట్టి వుండేదే!

కాని అది ఆ ప్రదేశం దాటలేదు. అపర్ణ గొంతులో చిన్న శబ్దం చేసి ఆగిపోయింది.

అప్పుడు తట్టింది ఆమె మస్తిష్కానికి. విఠోబా అన్న మాటలు.

''ఈ మంత్రగత్తెలకు అద్భుత శక్తులుంటాయి– అవి తప్పించుకునే ప్రయత్నాలు

## రియల్ వైఫ్!

★ సర్ వాల్టర్ రెలీ చనిపోయిన తరువాత విధవరాలైన ఆయన భార్య ఆమె చనిపోయే వర (అంటే 29 సంవత్సరాలు) రెలీ ముఖ్ర ... ఎక్కడికెళ్లినా పట్టుకు ... గేదట!

–బల్లా సుశీలా ప్రమీ



చేస్తాయి. దీని తాలూకు ఎవరైనా వస్తే వాళ్ళను ఊరి పొలిమేర దాటక ముందే వేసెయ్యాలి–''

ఆమె ముఖం పాలిపోయింది–

శ్రీనివాస్ బయట వాళ్ళతో మాట్లాడుతున్నాడు.

''మా చెల్లాయి ఇంట్లో లేదు – ఎక్కడికెళ్ళింది?''

''ఏమో! సరస్వతి నది దగ్గర ఇంటి పనులు చేసుకుంటూ వుందేమో–''

ఆ మాటలు శ్రీనివాసుకు అర్థం అవలేదు.

''అన్నయ్యా! పారిపో– వీళ్ళు మూర్ఖులు– నిన్ను చంపేస్తారు. పారిపో– పారిపో–''

అపర్ణ హృదయం తన గురించి ఆలోచించడం లేదు. తనకింకా మూడు రోజులు టైము వుంది.


ఆమె దేముడ్ని ప్రార్థిస్తోంది–

''మా అన్నయ్యను రక్షించు–''

ఆమె ఇంకో రకంగా ప్రార్థిస్తే బాగుండేది.

''భగవాన్! వీళ్ళకు జ్ఞానోదయం కలిగించు–'' అని.

అది ఆ చీకటిలో సూర్యకిరణం లాటిదే! ఆశ.




డిజైన్: ఆర్. తారాబాలాకృష్ణ (హైదరాబాద్)